
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

మంగళవారం 6 మే 2025

అకాల కష్టం

- క్షేత్రస్థాయిలో పర్యటించిన వ్యవసాయాధికారులు
- ప్రాథమికంగా నష్టం అంచనా
- రైతులను ఓదార్చిన నాయకులు

7



గజ్వేల్ మండలం పిడిచెడ్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన వర్షం నీరు

మొగులు... గుబులు

- అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన
- తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయిస్తున్న వైనం
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు

గజ్వేల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆకాశంలో నల్ల మబ్బులు కమ్ముకున్నాయంటే రైతుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. ఉదయం బీభత్సమైన ఎండ కొడుతున్నప్పటికీ మధ్యాహ్నం లేదంటే సాయంత్రి గాలిదుమారంతో కూడిన వర్షం, వడగళ్ల వాన కురుస్తుండడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. గజ్వేల్ డివిజన్‌లో ఇప్పుడిప్పుడే వరి కోతలను మొదలుపెట్టిన రైతులు ఆగమాగ మవుతున్నారు. కల్లాల్లో ధాన్యాన్ని ఆరబోసేందుకు ప్రయత్నిస్తూ మొగులు కమ్ముకొస్తుండడంతో ఆదరాబాదరగా కుప్పలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం లేచే సరికి యథావిధిగా తీవ్రమైన ఎండ కొడుతుండడంతో ధాన్యం ఎండుతుందని భావించే రైతులకు మధ్యాహ్నానికి చుక్కెదురవుతుంది. ఇటీవల జిల్లాలో నిత్యం ఇదే తంతు ఉంటుండడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

సొమ్ము చేసుకుంటున్న దళారులు

వాతావరణం అనుకూలించకపోవడంతో రైతాంగాన్ని దళారులు నిండా ముంచుతున్నారు. ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ. 2300 ఉంటే బహిరంగ మార్కెట్‌లో కేవలం రూ.1800 ధాన్యా న్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు అప్పులే మిగులుతున్నాయి. ఆరబెడదామంటే వర్షం భయం, అమ్ముకుందామంటే దళారుల బెడదతో దిక్కుతోచని స్థితిలో రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలంటే నానా అగచాట్లు పడాల్సి వస్తుంది. లారీల సమస్య, హమాలీల సమస్య తేమశాతం, గన్ని బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు లేకపోవడం ఇలా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోలు సైతం ఇటీవలే ప్రారంభించామని సాక్ష్యాత్తు అధికారులే రైతులకు బదులిస్తున్నారు. కోతలు ఇప్పుడే ప్రారంభమయ్యాయని, మరికొంత సమయం కావాలని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులు మాత్రం అటు పంటలను ఆరబెట్టుకోలేక, ఇటు ప్రభుత్వానికి అమ్ముకోలేక దళారులకు విక్రయిస్తూ.. తీవ్రంగా నష్టపోతున్నారు.

మిగతా పంటలకూ ఇబ్బందే..

అకాల వర్షాలతో వరితో పాటు ఇతర పంటలకు ఇబ్బందులు తప్పడం లేదు. మామిడి నేలరాలడంతో పాటు, మొక్కజొన్న అడ్డం పడడంతో పాటుగా కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. జిల్లావ్యాప్తంగా గతంలో కురిసిన వానలతో పాటు ప్రస్తుత వానలకు దాదాపు 11 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

దంచికొట్టిన వాన


తొగుట, మే 5(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఈదురుగాలులతో పాటు ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం పడింది. ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షం నుండి తేరుకోకముందే మరోమారు వర్షం పడటంతో రైతన్నలను కోలుకోలేని దెబ్బతీసింది. దాంతో కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోయింది. తొగుట మండలంలో, హుస్నాబాద్ మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురియడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది

9,368 ఎకరాల్లో పంట నష్టం



సిద్దిపేట మార్కెట్ యార్డులో తడిసిన ధ్యాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

- ప్రాథమిక అంచనా వేసిన జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు
- తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



సిద్దిపేట కలెక్టరేట్, మే5(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేస్తుంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట.. నేలపాలైంది. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వరి, కూరగాయల పంటలతోపాటు మామిడి తోటలు దెబ్బతిన్నాయి.

పంట నష్టం..

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను కలెక్టర్ మనుచౌదరి, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయాధికారి రాధిక, ఏడీఏలు, ఏవోలతో పాటు ఏఈవోలు క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. నష్టం వివరాలను ప్రాథమికంగా అంచనావేశారు. వర్షం కురిసిన గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలు సేకరించి రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన ప్రతి రైతు వివరాలను నమోదు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. మామిడి, వరి, ఉద్యాన పంటలకు పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. జిల్లాలో 9,368 ఎకరాల్లో పంట ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. పంటలు నష్టపోయాయని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

గాలి దుమారంతో పాటు భారీ వర్షం కురవడంతో మార్కెట్లలో ఉన్న ధాన్యం కొట్టుకుపోయి తడిసిముద్దయింది. ఒక్కోసారి 15 రోజులు దాటినా కొనుగోళ్లు చేపట్టడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు సెంటర్లలో తూకం వేసిన బస్తాలు సైతం ముద్దయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే కొనుగోలు సెంటర్లలో వేచిచూడాల్సి వస్తుందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం తడిసి ముద్దయ్యింది



తేమ శాతం ఎక్కువగా ఉందని చెప్పడంతో ఐదు రోజుల నుంచి సిద్దిపేట మార్కెట్ యార్డులోనే వడ్లను ఆరబెడుతున్నాం. భారీ వర్షం వల్ల దాదాపు రెండు ట్రాకర్ల వడ్లు తడిసి ముద్దయ్యాయి. ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

- తార మహిళా రైతు రంగదాంపల్లి

రెండు ట్రాక్టర్ల వడ్లు కొట్టుకుపోయాయి



మాకున్న పొలంతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాం. ధాన్యాన్ని సిద్దిపేట మార్కెట్ యార్డుకు ఐదు రోజుల క్రితం తీసుకొచ్చాం. గాలి దుమారం, భారీ వర్షం వల్ల రెండు ట్రాక్టర్ల వడ్లు వర్షానికి కొట్టుకుపోయాయి. ధాన్యమంతా తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని కోతలు లేకుండా అధికారులు కొనుగోలు చేయాలి.

- భవాని మహిళా రైతు





కోహెడ మండలం బస్వాపూర్ ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ మనుచౌదరి

కోహెడ, మే 5 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ మనుచౌదరి హెచ్చరించారు. సోమవారం కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలో ఉన్న గన్నిబ్యాగులు, తేమశాతం కొలిచే యంత్రాలు, వేయింగ్ మిషన్లు, ప్యాడీ క్లీనర్ల పనితీరును పరిశీలించారు. ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, గన్నిబ్యాగులు తాగునీరును అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం రిజిస్టర్లు తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. లారీలు కొరత ఉందని చెప్పడంతో ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. సరిపడా లారీలు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బు జమ అయ్యేవిధంగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు తాడిపత్రిలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈనెల 15 వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రవీణ్ కుమార్, ఏపీఎం తిరుపతి, కేంద్ర నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

బీరంగూడలో 'రామ్‌రాజ్' కాటన్ షోరూం



రామ్‌రాజ్ షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

సంగారెడ్డి, మే 4 (ఆంధ్రజ్యోతి): వస్త్ర ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన 'రామ్‌రాజ్' కాటన్ షోరూం సంగారెడ్డి జిల్లా బీరంగూడలోని భ్రమరాంబికనగర్‌లో ఏర్పాటైంది. ఈ షోరూంను ఆదివారం రాష్ట్ర మాజీ ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారథి లాంఛనంగా ప్రారంభించగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి దీపప్రజ్వలన గావించారు. సఫాల ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ సీఈవో పైడి ఎల్లారెడ్డి తొలి కొనుగోలును స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తాము బాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడేందుకు కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ఆవిష్కరించినట్లు వివరించారు. నిపుణులచే రూపొందించబడిన మెత్తటి కాటన్‌తో తయారుచేయబడిన రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలు దేశవ్యాప్తంగా అందుబాటులో వున్నట్లు పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలు, విమానాశ్రయాలలో తమ షోరూంలు తెరవబడుతున్నాయని తెలిపారు. రామ్‌రాజ్ కాటన్ ధోతీ, చొక్కా, బనియన్లు షోరూంలలోనే కాకుండా ప్రముఖ టెక్స్‌టైల్ షోరూంలలో కూడా అందుబాటులో వున్నట్లు వివరించారు.

ఫోర్‌లేన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ



హుస్నాబాద్‌రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నుంచి అక్కన్నపేట మీదుగా జనగామ జిల్లా కేంద్రం వరకు డబుల్‌లేన్ రోడ్డును ఫోర్‌లేన్ల రోడ్డుగా మార్చాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సోమవారం లేఖ పంపారు. జిల్లా రోడ్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ నేషనల్ హైవేగా మార్చి హుస్నాబాద్ నియోజకవర్గంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని కేంద్రమంత్రిని లేఖలో కోరినట్లు మంత్రి పొన్నం వివరించారు. ప్రస్తుతం ఉన్న మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్డు హుస్నాబాద్ నుంచి జనగామ రోడ్డు చాలా ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు. హుస్నాబాద్ నుంచి జనగామ జిల్లా వరకు ఉన్న డబుల్ రోడ్డు 52 కిలోమీటర్లు ఉంటుందని, ఈ రహదారిని ఫోర్‌లైన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని చెప్పారు. హుస్నాబాద్ నుంచి జనగామ వెళ్లే రహదారి ప్రధానంగా కరీంనగర్, సిద్దిపేట, జనగామ జిల్లాలకు అనుసంధానంగా హుస్నాబాద్ పట్టణం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి వెంట శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, గౌరవెల్లి ప్రాజెక్టుల కింద వ్యవసాయ పరంగా బాగా అభివృద్ధి చెందిన ప్రాంతం అన్నారు. అలాగే ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కొమురవెల్లి మల్లన్న, కొలనుపాకలోని జైన ఆలయం, యాదాద్రిలోని నరసింహస్వామి ఆలయాలను ఈ రహదారి కలుపుతుందని ప్రధాన పట్టణాలైన కరీంనగర్-కొత్తపల్లి, చిగురుమామిడి, హుస్నాబాద్, అక్కన్నపేట, తరిగొప్పుల, నర్మెట, వడ్లకొండ, జనగామను కలుపుతుందని పేర్కొన్నారు. అందువల్ల ఈ రహదారిని ఫోర్‌లేన్ రోడ్డుగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఆదాయం పెంపుపై అధికారుల నజర్

- విస్తీర్ణంలో జిల్లాలోనే అతిపెద్దది.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ
- ఆశించిన స్థాయిలో లేని ఆదాయం
- ఎర్లీబర్డ్ పథకంతో పాటు అనుమతి లేని భవనాల గుర్తింపుతో ఈసారి గణనీయంగా పెరిగిన పన్ను వసూళ్లు

8

చెక్కుల పంపిణీలో ఘర్షణ

కుకునూరుపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి రైతువేదికలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమం ముగిసిన తర్వాత పార్టీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉన్నట్లు తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వీరేశం వీరుపాక శ్రీనివాస్‌రెడ్డిని నిలదీయంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొండపాక ఏఎంసీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి వీరేశంపై చేయి చేసుకున్నారు. వీరేశం కూడా శ్రీనివాస్‌రెడ్డిపై తిరిగి చేయిచేసుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. పలువురు నాయకులు వారిద్దరిని సముదాయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మెదక్ డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ వీరుపాక శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మార్వో సుజాత మరియు పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

ప్రజావాణికి 78 దరఖాస్తులు

- అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుందని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలసి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పించన్ల ఇతర అర్జీలు మొత్తం 78 వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫుల్‌గా తాగేస్తున్నారు..

- మద్యం ధరలు పెరిగినా తగ్గని విక్రయాలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1116 కోట్లు
- గత ఏడాది కంటే రూ.16 కోట్లు అధికం
- తగ్గిన బీర్ల అమ్మకాలు

సిద్దిపేట క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): మద్యం ధరలు పెరిగినా కూడా విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. మద్యం దుకాణాలతో పాటు గ్రామగ్రామాన పుట్టగొడుగుళ్ల వెలసిన బెల్టుషాపుల ద్వారా అధికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, మిరుదొడ్డి, చేర్యాల, హుస్నాబాద్ ఐదు ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 93 మద్యం దుకాణాలు, 16 బార్లు ఉన్నాయి. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఎక్సైజ్ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.1116 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాది 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంలో రూ.1100 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ. 16 కోట్ల మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగాయి. జిల్లాలోని ఒక్కోవైన్స్‌లో సుమారు రూ.3 లక్షల నుంచి రూ.8లక్షల వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లా మొత్తంలో నెలకు సుమారు రూ.85కోట్ల మద్యం అమ్మకాలు అవుతున్నాయి.

తగ్గిన బీర్ల అమ్మకాలు

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు తక్కువయ్యాయి. విస్కీ అమ్మకాలు మాత్రం పెరిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1049814 విస్కీ కేసులు, 1886279 బీర్ల కేసుల అమ్మకాలు జరిగాయి వీటి విలువ రూ.1100 కోట్లు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1064814 విస్కీ కేసులు, 1854929 బీర్ల కేసుల అమ్మకాలు జరిగాయి వీటి విలువ రూ. 1116 కోట్లు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు తక్కువగా జరిగాయి. ఇటీవల ప్రభుత్వం విస్కీ ఫుల్ బాటిల్ పై, బీర్లపై ధరలు పెంచింది. ధరలు బాగా పెరగడంతో మద్యం అమ్మకాలు తక్కువగా అవుతాయని అనుకున్నారు. దానికి విరుద్ధంగా మారింది. మద్యం ధరలు పెరిగినప్పటికీ అమ్మకాలు మాత్రం తగ్గలేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మద్యం అమ్మకాలు జిల్లాలో పెరిగాయి. గత ఏడాది మద్యం ధరలు పెరగలేదు. ఈ ఏడాది మద్యం ధరలు పెరిగాయి. అయినా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో రూ.16 కోట్ల మద్యం అమ్మకాలు పెరిగాయి.



కాలువల పనులు పూర్తిచేసి నీరందించాలి

- ఇరిగేషన్ ఎస్‌ఈని కోరిన పెద్దగుండవెల్లి రైతులు

దుబ్బాక, మే5(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న కాలువల పనులు పూర్తిచేసి, తమ గ్రామానికి మల్లన్నసాగర్ ద్వారా నీళ్లు అందించి చెరువులు, కుంటలు నింపాలని సోమవారం దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామ రైతులు ఇరిగేషన్ ఎస్ఈని కలిసి విన్నవించుకున్నారు. ఆ గ్రామ యువజన నాయకుడు చేపూరి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో రైతులు సిద్దిపేట తరలివెళ్లారు. తమ గ్రామంలో సుమారు 3,500 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, భూగర్భజలాలు అడుగంటిపోయి, యాసంగి పంటలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. యాసంగిలో తాము ఎంత మొత్తుకున్నా కాలువలను అసంపూర్తిగానే వదిలేశారని చెప్పారు. యాసంగి కోతలు పూర్తికావడంతో కాలువలు పూర్తి చేయడానికి అనువైన సమయమని చెప్పారు. వ్యవసాయ పనులు మొదలు పెడితే నాట్లేసిన పంటపొలాల నుంచి కాలువలను ఏర్పాటు చేయడం కుదరని తెలిపారు. తక్షణమే పనులను త్వరగా పూర్తి చేసి తమ గ్రామ చెరువులను నింపాలని వినతిపత్రం అందచేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రెడ్డబోయిన మల్లయ్య, రవి, కొండల్‌రెడ్డి, సురేష్, తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

● యూపీఎస్ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ

నర్సాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, కావున తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని నర్సాపూర్ మండలం అచ్చంపేట యూపీఎస్ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతుందని చెప్పారు.

40 పడకల ఆయుష్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో 40 పడకల ఆయుష్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్‌మహేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అతి తక్కువ ఖర్చుతో అనేక రకాల వ్యాధులను నయం చేసే ప్రాచీన వైద్యమైన ఆయూష్ వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని ఆయన కోరారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

● రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి అధిక దిగుబడి సాధించాలి

హుస్నాబాద్‌రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి శాస్త్రవేత్తలు సూచించే మెలకువలను పాటించి అధికదిగుబడులు సాధించాలని తోర్నాల ఏరువాక వ్యవసాయ పరిశోదన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ శ్రీదేవి అన్నారు. సోమవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె రైతులకు వ్యవసాయానికి సంబంధించి సూచనలు, సలహాలు అందించారు. ఎక్కువగా యూరియా వాడకాన్ని తగ్గించి, రసాయన ఎరువులను అవసరం మేరకే వాడి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని రైతులకు సూచించారు. ఖరీఫ్‌లో రైతులు విత్తనాలు కొన్నప్పుడు రసీదును పొంది భద్రపరుచుకోవాలన్నారు. పంటల్లో సాగునీటి ఆదా, ప్రత్యామ్నాయ పంటల వివరాలు, చెట్ల పెంపకం లాంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌ద్వారా రైతులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో

పంటలకు రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంటలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు ఎం.శాంతి, రవీందర్‌నాయక్ మాట్లాడుతూ నేలకు సంబంధించిన వివిధ అంశాలతో పాటు నేల రకం, స్వభావం, ఎరువుల యాజమాన్యం తదితర వాటిని వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రైతుల వద్దకే శాస్త్రవేత్తలు

ములుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేయడానికి సోమవారం వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్‌కు చెందిన శాస్త్రవేత్తలు ములుగు, చిన్నతిమ్మాపూర్, కొక్కొండ గ్రామాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ రైతు శాస్త్రవేత్తల కార్యక్రమంలో ప్రతి వారం 2500 గ్రామాలను శాస్త్రవేత్తలు సందర్శించి మొత్తంగా 1200 గ్రామాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



పోలీసు, సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహణ

పేటలో పోలీసుల కవాతు

పెద్దశంకరంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటలో పోలీసు సిబ్బంది సోమవారం సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక పోలీసు బృందం సభ్యులతో పేట పురవీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శాంతిభద్రతల దృష్ట్యా నిర్వహించినట్లు ఏఎస్సై తెలిపారు.

మెప్మా నిధుల దుర్వినియోగం అంశంలో కొత్త ట్విస్ట్

● అయోమయంలో రూ.67లక్షలనిధులు

గజ్వేల్, మే 5(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మెప్మాలో నిధుల దుర్వినియోగం అంశం రోజుకో కొత్త మలుపు తిరుగుతుంది. ఇప్పటివరకు దాదాపుగా ఏడు గ్రూపులకు సంబంధించిన సభ్యులు తమకు సంబంధించిన నిధులు దుర్వినియెగం అయ్యాయని మున్సిపల్ కమిషనర్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన మెప్మా ఆర్పీ కృష్ణలీల ఆత్మాహత్యాయత్నానికి పాల్పడి, ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే బయటకు వచ్చింది. తాజాగా ఆమె గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తాను ఆయా గ్రూపుల నుంచి తీసుకున్న డబ్బులను అప్పట్లో సీఇఓగా పనిచేసిన వంగాల సరితకు ఇచ్చానని, అందుకు సంబంధించిన ఆన్‌లైన్ రసీదులను జతచేశానని పేర్కొన్నారు. దాదాపుగా రూ.67లక్షలకు సంబంధించిన మెప్మా సభ్యుల నిధులు ప్రస్తుతం అయోమయంలో పడ్డాయి. కాగా ఇటీవలే సీఇఓ సరిత దుబ్బాకకు బదిలీ కాగా, ఆమె స్థానంలో హుస్నాబాద్ సీవో గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌కు బదిలీపై వచ్చారు. మెప్మా పీడీ రెండు గ్రూపులకు సంబంధించిన విచారణ చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఆర్పీ వ్రాతపూర్వకంగా మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంలో ఈ అంశం కొత్త మలుపు తీసుకుంది.

'పాకిస్తానీయులను బహిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి'

సంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దోమల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

తాళం పగలగొట్టి దొంగతనం

టేక్మాల్, మే, 5 (ఆంధ్రజ్యోతి): టేక్మాల్ మండలంలోని కాడిలాబాయి తండాలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళం పగలగొట్టి తులం బంగారం, 35తులాల వెండి, 15వేల నగదును దొంగలించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్ ఉద్యోగానికి వెళ్లగా భార్య కూలీపనికి, కుటుంబసభ్యులు పొలం పనికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళంపగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ ఒకరి మృతి

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కార్, బైక్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం పెద్దశంకరంపేట శివారులో చోటు చేసుకుంది. మల్కాపూర్ గ్రామానికి చెందిన బి.మురళీక్రిష్ణ(30), తన బంధువు హరీశ్‌తో కలిసి మల్కాపూర్‌కు వెళ్తుండగా, రేగోడు వైపు నుంచి వస్తున్న కారు, బైక్ ఢీ కొన్నాయి. దీంతో మల్కాపూర్ గ్రామానికి చెందిన బి.మురళీక్రిష్ణ(30) అక్కడికక్కడే మృతి చెందారు. హరీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మురళీక్రిష్ణ మృతదేహాన్ని జోగిపేట ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. మురళీక్రిష్ణకు భార్య అంకిత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పెద్దశంకరంపేట ట్రైనీ ఎస్సై అరవింద్, సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఫోన్లో మాట్లాడుతూ.. చెరువులో దూకి యువతి ఆత్మహత్య

పాపన్నపేట.మే 5 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో మాట్లాడుతూ చెరువులో దూకి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మల్లంపేటలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లంపేట గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య, శ్యామల దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. మల్లయ్య మృతి చెందగా తల్లి శ్యామల ఇద్దరు ఆడపిల్లల పెళ్లిలు చేసింది. బతుకుదెరువు కోసం శ్యామల చిన్న కూతురు ప్రియాంకతో కలసి కొంతకాలం హైదరబాద్‌కు వలస వెళ్లారు. రెండునెలల క్రితం సొంత గ్రామానికి వచ్చారు. సోమవారం ప్రియాంక ఫోన్లో మాట్లాడుతూ గ్రామంలోని రెడ్ల చెరువు వద్దకు వెళ్లి నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

టేక్మాల్, మే 5 (ఆంధ్రజ్యోతి): 161 రహదారిపై వాహనం టైర్ పంచర్ అయి అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని బోడ్మాట్ పల్లి గ్రామ సమీపంలో జరిగింది. నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు బోల్తా పడటటంతో కారులోని ఎయిర్‌బాక్స్ తెరుచుకోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరలేదు. అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. .

పరిశ్రమలు ఏర్పాటు చేయండి: ఎమ్మెల్సీ సత్యం

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడి వలసలకు పేరు గాంచిన నారాయణఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి వలసలను నివారించాలని సీపీఐ ఎమ్మెల్సీ నేలకంటి సత్యం అన్నారు. ఖేడ్‌లో సోమవారం సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంజీరానది ఈ ప్రాంతం మీదుగానే ప్రవహిస్తున్నందున జలాలను ఈ ప్రాంత సాగు, తాగునీటి అవసరాలకు ఇవ్వాలన్నారు.

సౌత్‌జోన్ నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు కార్తీక్

మద్దూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బేజాడి కార్తీక్ గౌతమ్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరచాడు. 9 నుంచి 12 వరకు తమిళనాడులో జరిగే టోర్నమెంట్‌లో తెలంగాణ జట్టు తరపున పాల్గొంటున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌బాబు తెలిపారు.


నంగునూరు మండలం దర్గపల్లి గ్రామంలో అకాల వర్షంతో రాలిన మామిడి తోటలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు


మనోహరాబాద్ మండలం కోనాయపల్లి గ్రామంలో నేలకొరిగిన వరి పైరు


అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో కొలతలతో పంట నష్టం అంచనా వేస్తున్న వ్యవసాయాధికారులు

అకాల కష్టం

- క్షేత్రస్థాయిలో పర్యటించిన వ్యవసాయాధికారులు
- ప్రాథమికంగా నష్టం అంచనా
- రైతులను ఓదార్చిన నాయకులు

సిద్దిపేట జిల్లాలో 9,368 ఎకరాల్లో పంటలకు నష్టం

మెదక్ జిల్లాలో సుమారు 500 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

దుబ్బాక/రాయపోల్/కోహెడ/కొండపాక, మే 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం అన్నదాతల కష్టాన్ని నీళ్లపాలు చేసింది. ఆదివారం సాయంత్రం సిద్దిపేట, మెదక్ జిల్లాలో కురిసిన వడగండ్ల వాన అపార నష్టాన్ని మిగిల్చింది. వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. సోమవారం వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లి ప్రాథమికంగా నష్టాన్ని అంచనా వేశారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం.. సిద్దిపేట జిల్లాలో దాదాపుగా 9,368 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దుబ్బాక నియోజవర్గంలో ఎక్కువగా నష్టం చేకూరింది.

● దుబ్బాక నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 3,441 ఎకరాల పంట నష్టం వాటిల్లినట్టు దుబ్బాక వ్యవసాయ శాఖ ఏడీఏ మల్లయ్య తెలిపారు. సోమవారం ఏవోల బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరపగా, దుబ్బాక మండలంలో స్వల్పంగా నష్టం వాటిల్లిందని తెలిపారు. దౌల్తాబాద్ మండలంలో 350 ఎకరాల్లో వరి పంట దెబ్బతినడంతో సుమారు 180 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. భూంపల్లి- అక్బర్‌పేట మండలంలో 837 ఎకరాల్లో వరి, 11 ఎకరాల్లో మొక్కజొన్న, ఐదెకరాలో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. తొగుట మండలంలో 545 ఎకరాల వరి, 15 ఎకరాల్లో మొక్కజొన్న, 18 ఎకరాల కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. మిరుదొడ్డి మండలంలో సుమారు 1,660 ఎకరాలు


కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న దృశ్యం

పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

● రాయపోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 350 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. 314 ఎకరాల్లో వరి, 22 ఎకరాల్లో మొక్కజొన్న, 15 ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని పేర్కొన్నారు.

● కోహెడ మండలంలో 1,274 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. సోమవారం జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సువర్ణ, మండల వ్యవసాయ అధికారి సతీష్ మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న మామిడి, ఇతర పంటలను పరిశీలించారు. మండలంలోని 447 మంది రైతులకు సంబంధించిన 1,274 ఎకరాల్లో మామిడి, కొంత భాగం వరి, మొక్కజొన్న, నిమ్మ పంటలకు నష్టం జరిగినట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. వారి వెంట మండల ఉద్యానవన అధికారి బాలాజీ, ఆర్‌ఐ ఎల్లయ్య, ఏఈవోలు, పలువురు ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు దెబ్బతిన్న పంటలను, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అకాల వర్షంతో పంటలను నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించాలని కొండబత్తిని సతీష్, మామిడి కర్ణాకర్, నరాల శ్రీకాంత్ తదితరులు డిమాండ్ చేశారు.

● కొండపాక మండలంలోని మండలంలోని మర్పడగ, సిరసనగండ్ల, ఖమ్మంపల్లి, దమ్మకపల్లి, కొండపాక తదితర గ్రామాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించిన నష్టం వివరాలను సేకరించారు. పలు గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణతో కలిసి పరిశీలించారు.


రామాయంపేట మండలం రాయిలాపూర్ శివారు పొలాల్లో వరి పైరును పరిశీలిస్తున్న మైనంపల్లి

మెదక్ జిల్లాలో మూడు మండలాల్లో

అల్లాదుర్గం/చేగుంట/రామాయంపేట/నిజాంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని రామాయంపేట, చేగుంట, అల్లాదుర్గం మండలాలో పరిధిలో ఆదివారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానకు 500 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో శివారులోని పెద్దచెరువు ఆయకట్టులో దెబ్బతిన్న వరి పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఎంపీఎస్‌వో సుమయ, ఏఈవో విఠల్ రావు తదితరులు సోమవారం పరిశీలించారు. బాధిత రైతు రోదన వారిని కలిచివేసింది. పంట చేతికందే సమయానికి నీటిపాలైందంటూ ఆవేదనను వ్యక్తం చేశారు. గడిపెద్దాపూర్‌లో 264 ఎరాల్లో పంట దెబ్బతిందని ప్రాథమిక అంచనా వేశామని వ్యవసాయ శాఖ అధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. చేగుంట మండలంలో వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పంటలను పరిశీలించారు. మండలంలోని మక్కరాజపేట్, రాంపూర్, కసాన్పల్లి, చందాయిపేట్, గ్రామాల్లో 112 మంది రైతులకు చెందిన 157 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. మక్కరాజుపేట శివారులో 112 ఎకరాలు, రాంపూర్ శివారులో 26 ఎకరాలు కసాన్పల్లిలో 10 ఎకరాలు, చందాయపేట్ శివారులో 9 ఎకరాల్లో పంట నష్టపోయినట్టు అంచనా వేశామని పేర్కొన్నారు. రామాయంపేట మండలంలో 80 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. నిజాంపేట మండలంలో మామిడి తోటలను వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి, ఏఈవో శ్రీలతతో కలిసి పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. చల్మెడ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు.

మామిడి తోటలను పరిశీలించిన కలెక్టర్

అక్కన్నపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండల కేంద్రంలో దెబ్బతిన్న మామిడి తోటలను సోమవారం కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిందని, పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పంట నష్టంపై సర్వే చేసి, రిపోర్ట్ పంపించాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, తదితరులు ఉన్నారు.


అక్కన్నపేటలో మామిడి తోటలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్/రామాయంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయడంతోపాటు, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ఎలాంటి ఆందోళన చెందాల్సి అవసరం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు రావాల్సిన పరిహారం ఇప్పిచేందుకు చొరవ తీసుకుంటానని ఆయన వెల్లడించారు. రామాయంపేట మండల పరిధి రాయిలాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

● కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడగండ్లతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని లింగంపేట, కాన్గల్, ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. చేతికందే సమయంలో అకాల వర్షంతో పంట నష్టం జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. పంట నష్టం వివరాలను వ్యవసాయ అధికారుల నుండి తెప్పించుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా నష్టపరిహారం అందేలా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు ఉన్నారు.

రైతులపై హరీశ్‌రావుది కపట ప్రేమ

● కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి/సిద్దిపేట రూరల్, మే 5 : రైతులపై హరీశ్‌రావుది కపట ప్రేమని, అకాల వర్షం కురిసి గ్రామాల్లో రైతులు ఆగమైతుంటే ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ ఆరోపించారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం వెంకటపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిపిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలోనే రైతులను పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో పంట నష్టం జరిగినపుడు ఎకరాకు పది వేలు చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసగించారని మండిపడ్డారు. రైతులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వమే కోనుగోలు చేస్తుందని పూజల హరికృష్ణ రైతులకు భరోసా కల్పించారు. ఆయన వెంట పీసీసీ కార్యదర్శి గంప మహేందర్‌రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, తదితరులు ఉన్నారు. సిద్దిపేట పట్టణంలోని మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు.


రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద రైతుల ధర్నా

నష్టపరిహారం కోసం రైతుల ధర్నా

● గజ్వేల్ - చేగుంట రహదారిపై నిలిచిన వాహనాలు

రాయపోల్, మే 5 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన పంటలు వడగండ్ల వర్షంతో నేలపాలయ్యాయని అధికారులు వెంటనే పరిశీలించి నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద గజ్వేల్ - చేగుంట రహదారిపై రామారం, సయ్యద్‌నగర గ్రామాల రైతులు ధర్నా చేపట్టారు. రెండు గంటల పాటు రైతులు రోడ్డుపై ఆందోళన చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆదివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు వడ్లు పూర్తిగా రాలిపోయాయని, ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ రైతు ఏకంగా పురుగుల మందు డబ్బా చేతిలో పట్టుకుని నిరసనలో పాల్గొన్నాడు. రాయపోల్ ఏవో నరేష్, పోలీసులు అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. నష్టపోయిన రైతుల పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ధర్నాలో మాజీ వైస్ ఎంపీపీలు రాజిరెడ్డి, తలారి నర్సింలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతో రైతులకు పడిగాపులు : హరీశ్‌రావు

సిద్దిపేట కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం, సకాలంలో ధాన్యం సేకరణ చేయడంలో ప్రభుత్వ వైఫల్యంతో రోజుల తరబడి మార్కెట్ యార్డుల వద్ద రైతులకు పడిగాపులు తప్పడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సిద్దిపేట మార్కెట్‌యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే మార్కెట్లో 3,500 ధాన్యం బస్తాలు తరలించడానికి సిద్ధంగా ఉన్నా, లారీలు లేకపోవడంతో, ధాన్యం నీటిపాలైందని రైతులు హరీశ్‌రావుకు తెలిపి ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్‌తో హరీశ్‌రావు ఫోన్లో మాట్లాడి లారీలను, హమాలీలను వెంటనే సమకూర్చి ధాన్యాన్ని సేకరించాలని ఆదేశించారు. లారీ అసోసియేషన్‌తో మాట్లాడి ధాన్య సేకరణకు లారీలను పంపించాల్సిందిగా కోరారు. ధాన్యాన్ని చూసి కన్నీరుమున్నీరవుతున్న రైతులను ఆయన ఓదార్చారు.

నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి

నంగునూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం నంగునూరు మండలం దర్గపల్లి గ్రామంలో అకాల వర్షానికి నష్టపోయిన మామిడి తోటలను పరిశీలించి మాట్లాడారు. మొన్న వరి చేన్లు దెబ్బతింటే.. నేడు మామిడి తోటలకు నష్టం వాటిల్లిందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 1,800 ఎకరాల్లో మామిడి పంటలకు నష్టం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ శాఖ, రెవెన్యూ శాఖ, అధికారులు నష్టపరిహారం అంచనా వేసి తక్షణమే సహాయం అందించాలని తెలిపారు. నెలరోజుల్లోనే ప్రకృతి పగబట్టినట్టుగా ఐదుసార్లు అకాల వర్షాలు కురిశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎకరాకు రూ.35 వేల పరిహారం చెల్లించాలి : ఎమ్మెల్యే కేపీఆర్

తొగుట/మిరుదొడ్డి/రాయపోల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వడగండ్లతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు, ఆస్తి నష్టం వాటిల్లిన రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి(కేపీఆర్) డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలం అల్వాల, తొగుట మండలం లింగంపేట్, కాన్గల్, రాయపోల్ మండలం రామారం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో సోమవారం ఆయన పరిశీలించి, రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడగండ్ల వర్షంతో చేతికివచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు బోరున విలపిస్తుంటే, వారికి భరోసా ఇవ్వాల్సిన జిల్లా కలెక్టర్ భూభారతి మీటింగ్‌కు వెళ్లానని చెప్పడం చూస్తేనే రైతుల పట్ల వారికి ఏపాటి ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. జిల్లా మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నీళ్లను సరైన సమయంలో పంటల సాగుకు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. దీంతో కూడవెళ్లి పరిహాహక ప్రాంతాల్లో సుమారు 574 రైతులకు సంబంధించి 1600 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

లంచాలు ఇవ్వనిదే పనులు జరగడం లేదు

అవినీతిని అంతం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రెవెన్యూ, పోలీసుస్టేషన్లతోపాటు ఇతర కార్యాలయాల్లో లంచాలు లేనిదే పనికావడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సంచలన వాఖ్యలను చేశారు. జిల్లా నుంచి మొదలుకొని మండలస్థాయి వరకు ఏశాఖలో ఏ పని కావాలన్నా లంచాలు ఇవ్వకుండా జరగడం లేదని ఆరోపించారు.


మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో వరి చేలును పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

నేడు వేణుగోపాల స్వామి జాతర ప్రారంభం

శివ్వంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి దొంతిలోని వేణుగోపాలస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల జాతరకు ముస్తాబైంది. ప్రతి ఏటా వైశాఖ మాసంలో 10 రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 6 నుంచి 16 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

రేపటి నుంచి నర్సాపూర్‌లో వాసవీ కన్యకపరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నర్సాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యాక పరమేశ్వరీ ఆలయంలో అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. 7న ఉదయం ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 9వవరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

లింగాపూర్‌లో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆకుల లింగాపూర్‌లో మంగళవారం నుంచి ఈనెల 11 వరకు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భవానీ మాతకు బోనాలు, 7న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కల్యాణం, బండ్ల ప్రదక్షణ, లాజహోమం, రేణుక ఎల్లమ్మ వీధి నాటకం మొదటి భాగం ప్రదర్శన నిర్వహించనున్నారు. 11న కుస్తీపోటీలు, వీధి నాటకం చివరి భాగం ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

బగలాముఖి ఆలయంలో జయంతి పూజలు

శివ్వంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేటలో వెలసిన శక్తిపీఠం బగలాముఖి ఆలయంలో సోమవారం అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో హరిద్రహర్చన, మహా పూజ, మహా మంత్రాహవనం ఘనంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యల విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

హత్నూర పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

హత్నూర, మే 5 (ఆంధ్రజ్యోతి): హత్నూర పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలనతో పాటు కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసు అధికారులు, సిబ్బంది స్నేహపూర్వకంగా ఉండి సహకరించాలని సూచించారు. ఎస్ఐ సుభాష్‌తో పాటు సిబ్బందితో ఎస్పీ మాట్లాడి మండలానికి సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పేదల కలలను సాకరం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని, సర్వే నిర్వహించి, పారదర్శకంగా అర్హులైన వారికే ఇళ్లను కేటాయిస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం ఆద్మాపూర్‌లో పర్యటించి ఇందిరమ్మ లబ్ధిదారులను కలిసి వారితో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా నిర్వహించేలా మండల ప్రత్యేక అధికారులు బాధ్యత వహించాలన్నారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలకు కలెక్టర్ సందర్శించారు. విన్నూత విద్యాబోధనకు చర్యలు తీసుకుంటున్న ఉపాధ్యాయుడు రవిరాజ్‌ను అభినందించారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

- భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి
- వచ్చిన దరఖాస్తులకు నెలలోపు పరిష్కారం
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

కొండాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : భూసంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి కోరారు. మండలంలోని తొగర్‌పల్లిలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించి, భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు ఒక మండలాన్ని ఎంపిక చేయగా, సంగారెడ్డి జిల్లాలో కొండాపూర్ మండలం ఎంపికైనట్లు వెల్లడించారు. జిల్లాలో భూసమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని, రెవెన్యూ సదస్సుల అనంతరం నెలలోపు భూసమస్యలన్నీ భూభారతి చట్టంతో పరిష్కారిస్తామన్నారు. సమస్యల కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరం అధికారులు, సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తారు. భూభారతి-2025 చట్టంతో అధికారులకు అధికారాలన్నీ వికేంద్రీకరించడంతో జవాబు దారితనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, తహసీల్దార్ అశోక్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


తొగర్‌పల్లిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరించి మాట్లాడుతున్న సంగారెడ్డికలెక్టర్ క్రాంతి

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలప్‌చెడ్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలను తీర్చడానికే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద చిలప్‌చెడ్ మండలం ఎంపిక అవగా సోమవారం మండలం పరిధిలోని రాందాసుగూడా, రహీంగూడా గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వారి సమస్యలను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించిన సమస్యలను గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులలోనే పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారని చెప్పారు. గణ్యతాండాలో ఎప్పటినుంచో ఉన్న భూ సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి కలెక్టరుకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సోమక్కపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసున్నారు.

20 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

● సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

అక్కన్నపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్కన్నపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, ఈ నెల 20 వరకు మండలంలోని అన్ని భూభారతి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. సోమవారం ఆయన అక్కన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం గతంలో మాదిరిగా కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. షెడ్యూల్ ఏ ద్వారా ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తీసుకున్న దరఖాస్తుల డేటాను సాయంత్రం ఎంటర్ చేసి భూభారతి పోర్టల్‌లో పెట్టడం జరుగుతుందని, సమస్యను బట్టి చట్టంలో ఉన్న విధంగా ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి వారం రోజుల్లో తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం అవుతుందన్నారు. భూభారతి చట్టంలో అన్ని సమస్యలు కూడా జిల్లా స్థాయిలోనే శాశ్వతంగా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఇందులో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూమికి వేలం

జగదేవ్‌పూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన భూములకు వేలం నిర్వహిస్తున్నట్లు కొండపోచమ్మ ఆలయ ఈవో రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన ఆరు సర్వే నెంబర్లలో 26 ఎకరాలకు ఏడాది పాటు కౌలు కోసం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలంను మంగళవారం గ్రామంలోని ఆలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు ముందుగానే రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

ఇంటర్ ఫస్టియర్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

మద్దూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అందె గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో 40 సీట్ల చొప్పున ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 26వ తేదీన ప్రచురిస్తామన్నారు. మే 27 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల ధ్రువీకరణతో పాటు ప్రవేశ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9542226129, 9000997100 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

కుక్కల దాడిలో దూడ మృతి

చేర్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో కుక్కల దాడిలో దూడ మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన ఉత్కం యాదయ్య తమ వ్యవసాయబావి వద్ద పశువులకొట్టం ఆవరణలో దూడను కట్టేసి పనుల్లో నిమగ్నమయ్యాడు. అదే సమయంలో కుక్కలు దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో మృతి చెందింది. గ్రామంలో కుక్కల బెడద నివారణకు గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

మర్కుక్, మే 5 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల కేంద్రమైన రైతు వేదికలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ గజ్వేల్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఆర్ఐలు శ్రీధర్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

గజ్వేల్ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన రాయకొండ లక్ష్మికి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు సోమవారం పీఏసీఎస్ చైర్మన్ జేజాల వెంకటేశం చేతుల మీదుగా రూ.29,526 విలువైన చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు. వెంట మాజీ వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత వ్యక్తిపై దాడిని నిరసిస్తూ ఆందోళన

చేర్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం వేచరేణి గ్రామశివారు ఎల్లదాసునగర్ కాలనీకి చెందిన దళితవ్యక్తిపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేర్యాలలో సీపీఎం, సీపీఐ నాయకులు వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. అనంతరం గ్రామానికి చేరుకుని సదరు వ్యక్తికి నూతన దుస్తులు అందించి మాట్లాడారు. మతోన్మాదంతో వ్యవహరించిన వారందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు ఆముదాల మల్లారెడ్డి, రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు, పోరెడ్డి రాజు, అందె అశోక్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలోనే అవినీతి

మిరుదొడ్డి, మే 5(ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అవినీతి జరిగిందని కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి కమలాకర్ అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో దుబ్బాక బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు, డబుల్‌బెడ్‌రూం, ధరణి పేరుతో పేదల భూములను కొల్లగొట్టి అవినీతికి పాల్పడిందని విమర్శించారు. ఇంత జరిగినా దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బాలుయాదవ్, నవీన్, వెంకటేశం, పరశురాములు తదితరులున్నారు.

ఆదాయం పెంపుపై అధికారుల నజర్

- విస్తీర్ణంలో జిల్లాలోనే అతిపెద్దది గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ
- ఆశించిన స్థాయిలో లేని ఆదాయం
- ఎర్లీబర్డ్ పథకంతో పాటు అనుమతి లేని భవనాల గుర్తింపుతో ఈసారి గణనీయంగా పెరిగిన పన్ను వసూళ్లు
- జిల్లా వ్యాప్తంగా 25శాతం ముందస్తు పన్ను చెల్లింపులు



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కార్యాలయం

గజ్వేల్, మే 5 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఆదాయం పెంపుపై అధికారులు దృష్టిసారించారు. జిల్లాలోనే విస్తీర్ణంలో పెద్ద మున్సిపాలిటీ అయినప్పటికీ ఆశించిన స్థాయిలో ఆదాయం లేకపోవడంతో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఆదాయం పెంపుదలకు కృషి చేశారు. ఈ క్రమంలో ఏడాది కాలంలో రూ.అరకోటికి పైగానే ఆదాయం పెరిగింది. గత నాలుగైదు ఏళ్లుగా పెద్ద రూపంలో, మునిసిపల్ రెవెన్యూ అధికారులు అక్రమంగా నిర్మించుకున్న అసెస్మెంట్‌లను గుర్తించి వాటికి ఆస్తి పన్ను విధించారు. దీంతో మున్సిపల్ ఆదాయం గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎర్లీబర్డ్ స్కీంను జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకుని, 25శాతం మేర ఆస్తి పన్నులను అడ్వాన్స్‌గా చెల్లించారు. ఎర్లీ బర్డ్ స్కీంలో సిద్దిపేట ప్రథమ స్థానంలో నిలువగా, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ ద్వితీయ స్థానంలో నిలిచింది.

'మల్లన్నసాగర్' భారంతో ర్యాంకుల్లో వెనుకబాటు

మున్సిపల్ పరిధిలో గత ఏడాదితో పోలిస్తే అదనంగా రూ.52లక్షల ఆస్తి పన్ను వసూలైంది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో అధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టి పన్ను విధించని అసెస్‌మెంట్‌లను గుర్తించి, రెండేళ్ల పన్నును ఏకకాలంలో వసూలు చేశారు. దీంతో మునిసిపాలిటీ ఆదాయం గణనీయంగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4.45 కోట్ల ఆస్తి పన్ను ఉండగా, రూ.3.96 కోట్ల పన్నును వసూలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ డిమాండ్ కాస్తా రూ.5.08 కోట్లకు చేరింది. కొత్తగా 2,261 అసెస్‌మెంట్లకు ఆస్తి పన్నును విధించడంతో రూ.4.45 కోట్లుగా ఉన్న డిమాండ్ కాస్తా రూ.5.08 కోట్లకు చేరింది. కాగా ఈ ఏడాది రూ.4కోట్ల ఆస్తి పన్నును మునిసిపల్ అధికారులు వసూలు చేశారు. మొత్తం బకాయిల్లో మల్లన్నసాగర్‌కు చెందిన 2,168 అసెస్‌మెంట్లకు సంబంధించిన రూ.41 లక్షల భారం పడడంతో మునిసిపాలిటీ ర్యాంకుల్లో వెనకబడిపోతున్నది.

ఎర్లీ బర్డ్ స్కీంలో సిద్దిపేట టాప్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ముందస్తు పన్ను వసూళ్లలో 5 శాతం రీబెట్(ఎర్లీ బర్డ్ స్కీం)లో సిద్దిపేట మునిసిపాలిటీ టాప్ ప్లేస్‌లో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 18వ స్థానంలో నిలిచిన సిద్దిపేట 28.71 శాతం వసూళ్లు చేయగా జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక గజ్వేల్-ప్రజ్ఞాపూర్ 24 శాతం పన్ను వసూళ్లతో 48వ స్థానంలో, జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలువగా, హుస్నాబాద్ మునిసిపాలిటీలో 11.43 శాతంతో రాష్ట్రస్థాయిలో 117వ స్థానంలో నిలిచింది. దుబ్బాక 119వ స్థానంలో నిలిచి 10.78 శాతం వసూళ్లు చేసింది. ఇక చేర్యాల 8.10శాతం పన్ను వసూళ్లతో రాష్ట్రంలో 132వ స్థానంలో నిలిచింది.

పెద్దమ్మతల్లి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలి



చిన్నకోడూరు: కస్తూరిపల్లిలో హరీశ్‌రావును సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

చిన్నకోడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పెద్దమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవ వేడుకలకు సోమవారం మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులు హరీశ్‌రావును సన్మానించారు. మల్లారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పీసు ప్రభాకర్ రెడ్డి (70) అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల్లో మాజీమంత్రి పాల్గొన్నారు. సికింద్లాపూర్‌లో మాజీ సర్పంచ్ దరిపల్లి రాజయ్య తండ్రి ఐలయ్య(85) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మర్కుక్, మే 5 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిధిలోని వరదరాజపూర్‌లో గల వరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితలకు ఉత్సవాల బాధ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వానించినవారిలో మాజీ సర్పంచ్ అప్పాల ప్రవీణ్, ఫ్యాక్స్ వైస్ చైర్మెన్ కమ్మరి బాలరాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగం ప్రభాకర్, జాగృతి నాయకులు ప్రవీణ్ యాదవ్, సంగ నవీన్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



సిద్దిపేటలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 5: విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని దర్గా ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర మైనారిటీ సెల్ మాజీ వైస్ చైర్మన్ వహీద్ ఖాన్ ఆధ్వర్యంలో ఇంటర్, పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పూజల హరికృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ కల్పనపై దృష్టి సారించి వరుస నోటిఫికేషన్లు జారీ చేయడంతో పాటుగా, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేసినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంప మహేందర్‌రావు, ఎజాజ్‌అహ్మద్, బొమ్మల యాదగిరి, కలీమొద్దిన్, మార్క సతీష్, దాస అంజన్న, గోపి కృష్ణ, మార్క సతీష్‌గౌడ్, మార్క పద్మ, దాస అంజయ్య, హర్షద్, మున్నా, వాహబ్, రాషద్, రాజు, సంతోషప్రతాప్, రాకేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు



గజ్వేల్, మే 5 (ఆంధ్రజ్యోతి): టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు పేర్కొన్నారు. గజ్వేల్ ప్రాంతానికి చెందిన తలకొక్కుల రాజు హైదరాబాద్‌లో హైకోర్టు సీనియర్ అడ్వకేట్‌గా పని చేస్తున్నారు. సోమవారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించి పలు రకాల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు రెండేళ్ల క్రితం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం ఉద్యోగ, ఉన్నత చదువులకు కేరాఫ్‌గా మారాయని గుర్తు చేశారు. పాఠకులకు అనుగుణంగా మ్యాగజైన్లు, ప్రామాణిక గ్రంథాలు, కేరీర్ ఓరియంటెడ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నెలకొల్పిన నాలెడ్జ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, వెబ్‌సైట్ సైతం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్ పక్కన మార్కెట్ రోడ్డులోని టీవైఆర్ ప్లైడ్‌లో విశాలమైన స్థలంలో లైబ్రరీ ఉందని, ఇప్పటికే అనేక మంది గ్రంథాయాలన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలను పొందారని వివరించారు.

జాబితాలో పేరొచ్చినా అందని ఆత్మీయ భరోసా!

మద్దూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారుల జాబితాలో పేరొచ్చినా అధికారుల నిర్లక్ష్యంతో డబ్బులు అకౌంట్‌లో జమకాలేదని మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పలువురు బాధితులు వాపోయారు. వివరాల్లోకి వెళ్తే.. మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామాన్ని జనవరి 26న ప్రభుత్వం పైలెట్ గ్రామంగా ఎంపిక చేసింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికి అందించింది. కాగా భూమిలేని వ్యవసాయ కూలీలు ఉపాధిహామీ పథకంలో సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసినవారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ఆదుకునేందుకు ఏడాదికి రూ.12 వేలు ప్రకటించింది. ఈక్రమంలో ధర్మారం గ్రామానికి చెందిన 27 మంది ఉపాధిహామీ కూలీలకు ఆత్మీయభరోసాలో చోటు దక్కింది. వారిలో 25మందికి బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమకాగా ఇద్దరికి మాత్రం జమ కాలేదు. దీంతో పాటు దూళిమిట్ట మండలంలో నలుగురికి రాలేదు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆత్మీయ భరోసా డబ్బులు పడలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ధర్మారం గ్రామానికి చెందిన తరిగొప్పుల లత అనే బాధితురాలు మాట్లాడుతూ.. తాను ఉపాధి హామీ పథకం కింద 20 రోజులకు పైగానే పని చేసినప్పటికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా డబ్బులు అకౌంట్‌లో జమ కాలేదని వాపోయింది.

మాచాపూర్‌లో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

చిన్నకోడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచాపూర్ గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ తృతీయ వార్షిక వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం పుట్టకు ధని పోశారు. ఈ సందర్భంగా మహిళలు జల బిందెలను డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్యన ఊరేగింపుగా గ్రామ శివారులోని పుట్ట వద్దకు తీసుకెళ్లారు. పుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేసి జల బిందెలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రి గ్రామ దేవత పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.


రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



చిన్నకోడూరు: ఓబులాపూర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న ఏవో జయంత్ కుమార్

చిన్నకోడూరు/మద్దూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని చిన్నకోడూరు ఏవో జయంత్ కుమార్, మద్దూరు ఏవో బి. రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆయామండలాల్లోని పలు గ్రామాల్లో వారు ఫార్మర్ రిజిస్ట్రీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఆధార్ తరహాలో ప్రతీ రైతుకు11 అంకెల విశిష్ట సంఖ్య (యూనికోడ్)ను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిదని తెలిపారు. విశిష్ట సంఖ్య నమోదుకు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డుకు లింకు చేయబడిన మొబైల్ నంబరును అందుబాటులో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. భూ పట్టా కలిగిన రైతులందరు ఏఈవోల ద్వారా గానీ రైతు వేదిక ద్వారా గానీ నమోదు చేయించుకోవాలని సూచించారు. కాగా చిన్నకోడూరు మండలంలోని ఓబులాపూర్, రామునిపట్ల, చిన్నకోడూరు గ్రామాల్లో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ పై ఏవో జయంత్ కుమార్ అవగాహన కల్పించి, 20 మంది రైతుల రిజిస్ట్రీ ప్రక్రియను పూర్తి చేశారు. అదేవిధంగా మద్దూరు మండలకేంద్రంలో ఏవో బి. రామకృష్ణ రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధించి సందేహాలను నివృతి చేశారు.

దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని వెనక్కి పంపాలి



హుస్నాబాద్ డీటీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్‌రూరల్/మద్దూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను వెంటనే వారి దేశానికి పంపించాలని హుస్నాబాద్ బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొడ్డి శ్రీనివాస్, భూక్య సంపత్, బొమ్మగాని సతీష్, బత్తుల శంకర్‌బాబు, కొత్తపల్లి అశోక్ వెల్దండి రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో పాటు రోహింగ్యాలను వెంటనే వెనక్కి పంపాలని బీజేపీ మద్దూరు మండల అధ్యక్షుడు మోకు ఉదయ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ పిలుపు మేరకు మద్దూరు తహసీల్ కార్యాలయ అధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాపాక బుచ్చిరెడ్డి, బియ్య రమేష్, సందీప్, ఊట్ల రాంచంద్రారెడ్డి, శ్రీకాంత్, మేక మహేష్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసెవద్ద బాధితుడు లస్మయ్య

దౌల్తాబాద్,మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మాట గ్రామంలో ఓ నిరుపేద కుటుంబానికి చెందిన నివాస గుడిసె షార్ట్‌సర్క్యూట్‌తో ఆదివారం రాత్రి దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. దొమ్మాట గ్రామానికి చెందిన డప్పు లస్మయ్య పోచవ్వ దంపతులు 15 ఏళ్లుగా కూలీ పనులు చేసుకుంటూ పిల్లలతో కలిసి పూరిగుడిసెలో జీవిస్తున్నారు. ఆదివారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా సుమారు 11 గంటల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిద్రనుంచి మేలుకున్న దంపతులు మంటలను గమనించి భయంతో కేకలు వేసుకుంటూ బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కలవారు అప్రమత్తమై మంటలను ఆర్పేలోగా గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో రూ.20 వేల నగదు, ఒక బియ్యం బస్తా, విలువైన సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితులు వాపోయారు. రెవెన్యూ అధికారులు దొమ్మాటకు చేరుకొని బాధితుడి వద్ద వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని తమ కుటుంబాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నాగపురి జడ్పీఎస్ఎస్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

చేర్యాల, మే 5 (ఆంధ్ర జ్యోతి) : చేర్యాలమండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌కు చెందిన 2004-05 బ్యాచ్ పూర్వవిద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం పాటుపడతామని పేర్కొన్నారు.

బాలసదనం నుంచి మగ శిశువు దత్తత



మగ శిశువును దత్తతకు తీసుకుంటున్న దంపతులు

సిద్దిపేట అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో బాలసదనంలో ఉన్న మగ శిశువును నిజామాబాద్ జిల్లాకు చెందిన దంపతులకు సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ చేతుల మీదుగా దత్తత ఇచ్చినట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శిశువును దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ పలు సూచనలు చేశారు. బాబు బంగారు భవిషత్‌కు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అని వారికి సూచించారు. జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, శిశు గృహ మేనేజర్ రాజు, సామాజిక కార్యకర్త రాజారాం ఉన్నారు.

సర్కారు బడుల్లో క్రీడా శిబిరాలు

గజ్వేల్/గజ్వేల్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఎర్రవల్లిలోని ప్రైమరీ స్కూళ్లో స్పోర్ట్స్ జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ సిద్దిపేట ఆధ్వర్యంలో నెల రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, ఫుట్‌బాల్ ఎన్ఐఎస్ కోచ్ నర్సింలు, కోచ్ సందీప్, మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. ఎర్రవల్లిలోని ప్రైమరీ పాఠశాల గ్రౌండ్‌లో నెల రోజుల పాటు ఫుట్‌బాల్ ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు, కబడ్డీ సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. 16 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రమే అర్హత ఉంటుందన్నారు. అదేవిధంగా మండలంలోని కొడకండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన క్రీడాసంస్థ ఆధ్వర్యంలో ఉచిత హ్యాండ్ బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం తెలిపారు. మే 1 నుంచి 31 వరకు పాఠశాల క్రీడా ప్రాంగణంలో 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు ప్రతిరోజూ హ్యాండ్‌బాల్ ఆటలో శిక్షణను ఇస్తున్నట్టు తెలిపారు.

పలుచోట్ల సమ్మర్ క్యాంపు ముగింపు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎంఈవో కృష్ణ

గజ్వేల్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, నైతిక విలువలను పెంపొందించడమే సమ్మర్ క్యాంపు ముఖ్య ఉద్దేశమని గజ్వేల్ మండల విద్యాధికారి కృష్ణ అన్నారు. సోమవారం కొడకండ్ల ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు లింగం, టీపీటీఎఫ్ నాయకులు విద్యాసాగర్, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఏఏపీసీ చైర్మన్ కళ్యాణి, వీఏవో రేణుక, ఉపాధ్యాయులు రెహల, కల్పన, సాధన, రమ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **మర్కుక్:** సమ్మర్‌క్యాంపును సద్వినియోగం చేసుకున్న విద్యార్థుల్లో నైపుణ్యాలు చక్కగా మెరుగుపడ్డాయని మర్కుక్ మండల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం అంగడికిష్టాపూర్ పాఠశాలలో సమ్మర్‌క్యాంపు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బడి మాదిరిగా అన్ని బడులు ఉంటే ప్రైవేటు పాఠశాలలకు మన పిల్లలు ఎవరూ వెళ్లరని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. మాజీ సర్పంచ్ రాములుగౌడ్ సౌజన్యంతో ఈ 15 రోజులుగా విద్యార్థులకు టిఫిన్, బటర్‌మిల్క్ అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణానికి ఉద్యమించాలి

సిద్దిపేట అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): దోపిడీ లేని సమసమాజ నిర్మాణానికై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కారల్ మార్క్స్ 207వ జయంతి సందర్భంగా సోమవారం సిద్దిపేటలో మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ సమసమాజం ఏర్పడాలంటే కారల్ మార్క్స్ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మార్క్స్ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, కాముని గోపాలస్వామి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లాకమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, అత్తిని శారద, జాలిగపు శిరీష నాయకులు ఆముదాల రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.